క్లుప్తంగా

మంత్రి వేణును కలసిన జెడ్పీ సీఈఓ



మంత్రి వేణును కలసిన జెడ్పీ సీఈవో రమణారెడ్డి

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సీఈఓగా నియమితులైన రమణారెడ్డి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను శనివారం రామచంద్రపురం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి వేణుకు పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్ రెడ్డి, పార్టీ నేతలు మల్లిడి సత్తిరెడ్డి, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్ధికి ఈ-కేవైసీ తప్పనిసరి

కపిలేశ్వరపురం: 14వ విడత పీఎం కిసాన్ ఆర్థిక లబ్ధి పొందేందుకు అర్హత గల లబ్ధిదారులు తప్పనిసరిగా స్థానిక ఆర్‌బీకేలో ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. ఈనెలాఖరున పీఎం కిసాన్ ఆర్థిక సాయం విడుదల చేసే అవకాశం ఉందన్నారు. అర్హుల జాబితాను సిద్ధం చేశామన్నారు. ఈకేవైసీ పెండింగ్ ఉన్న వారిని గుర్తించి వారి వివరాలను ఆర్బీకేలో ఉంచామన్నారు. జాబితాలో పేరు ఉన్న రైతులు ఆర్బీకే ఉద్యోగిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ రమేష్‌కుమార్ సూచించారు.

అంగర వేంకటేశునికి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కోరుమిల్లి, తాతపూడి, కపిలేశ్వరపురం, వెదురుమూడి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామి వారిని విశేషంగా అలంకరించారు. దూర ప్రాంత భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

ప్రసన్నాంజనేయునికి ఎమ్మెల్సీ తోట పూజలు



చిన్న కోరుమిల్లి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: కోరుమిల్లి గ్రామ శివారు చిన్న కోరుమిల్లి గోదావరి గట్టుపై కొలువైన ప్రసన్న ఆంజనేయస్వామి భారీ విగ్రహం వద్ద శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రత్యేక పూజలు చేశారు. సుందరకాండ పారాయణలో భాగంగా వేద పండితులు స్వామికి విశేష పూజలు చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కష్టజీవుల శ్రమ ప్రాధాన్యం గల కోరుమిల్లి గ్రామం ఆధ్యాత్మికంగా విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆచంట వీవీ స్వామి, కొప్పిశెట్టి శ్రీను, వాసంశెట్టి విష్ణు, పాలింగి కృష్ణ కిశోర్, శ్రీనివాస్, నక్కా సింహాచలం, వంగా శ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ర్యాంకర్‌కు అభినందన



స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన బందారు విజయ, ఆమె తల్లిదండ్రులను అభినందిస్తున్న అధ్యాపకులు

కాజులూరు: సిల్వర్ సెట్ పరీక్షల్లో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన హెచ్ఈసీ విద్యార్థిని బందారు విజయ స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించగా అదే కళాశాలకు చెందిన హెచ్ఈసీ విద్యార్థి ఆనాల వీరమణిసురేంద్ర ఈడబ్ల్యూఎస్ కోటాలో సీటు సాధించారు. ఈ మేరకు శనివారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందం, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సిల్వర్‌జూబ్లీ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థులను, సిల్వర్ సెట్‌లో ర్యాంకులు సాధించడానికి సహకరించిన లైబ్రరి సైన్స్ అధ్యాపకుడు విశ్వ భీమేశ్వరరావులను ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

మంత్రి వేణు పరామర్శ

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడు శివారు ముచ్చెరువులో ఇటీవల మృతి చెందిన సూరంపూడి నాగభూషణం (80) కుటుంబాన్ని మంత్రి చెల్లుబోయిన వేణుశనివారం పరామర్శించారు. మృతుడి భార్య సత్యవతి, కుమారులు గోవిందరాజు, శ్రీను, బుజ్జి, సత్యనారాయణలను పరామర్శించారు. మంత్రి వేణు వెంట గ్రామ పెద్దలు, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతులకు కొండంత అండగా..

- వ్యవసాయ అనుబంధ పథకాలు
- నాలుగేళ్లలో రైతుల ఖాతాలకు రూ.142 కోట్లు



గొల్లపాలెంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

కాజులూరు: ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ప్రతి పనికి మండల కేంద్రాలకు వెళ్లి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరిగినా పనులు జరగకపోవటం, మరోపక్క వరుస నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక వ్యవసాయం దండగగా మారి రైతులు తీవ్ర నిరుత్సాహపడేవారు. అయితే పాదయాత్ర ద్వారా రైతుల కష్టాలను దగ్గరగా చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలలో ఆర్‌బీకేలను ఏర్పాటు ,ఊసి అధికార యంత్రాంగాన్ని రైతులకు చేరువ చేయడమే కాకుండా రైతు భరోసా, వైఎస్సార్ పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు, పంటల సాగుకు కావలసిన యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచటంతో ప్రస్తుతం రైతులకు వ్యవసాయం పండగలా మారింది. మండలంలో 18 వేల 424 ఎకరాల సాగు భూమి ఉండగా 14,813 మంది రైతులు పంటల సాగు చేస్తున్నారు. టైలాండ్ ఏరియా కావటంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ప్రతిసారీ ఇక్కడ నష్టతీవ్రత ఎక్కువగానే ఉంటుంది. రైతు సంక్షేమమే మా లక్ష్యం అంటూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెప్పడమే కాకుండా గత నాలుగేళ్లలో చేసి చూపడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గత ప్రభుత్వాల హయాంలో ఎప్పుడు లేని విధంగా రైతులకు యంత్రసేవా పథకం కింద రూ.కోటి 46 లక్షలు, వివిధ పథకాల ద్వారా రూ.1,40,1285000 నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వ జమ చేసింది. గత ప్రభుత్వ హయాంలో కంటి తుడుపుగానే రైతులకు అరకొరగా పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించారు.

అది కూడా పంట నష్టం జరిగిన రెండేళ్లకు గానీ రైతులకు అందేవి కావు. జన్మభూమి కమిటీల సిఫారసులున్న రైతులకు మాత్రమే వాటిని ఇచ్చేవారు. ఇలా టీడీపీ అయిదేళ్ల కాలంలో రైతులకు ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీల ద్వారా కేవలం నాలుగు కోట్ల 42 లక్షలు పంపిణీ చేయగా, రుణ మాఫీ పేరుతో రూ.రెండు కోట్ల 40 లక్షలు మాత్రమే ఇచ్చారు.

అందుబాటులో ఎరువులు



పల్లిపాలేనికి చెందిన రైతు కళా సత్యనారాయణ వ్యవసాయం చేసే సమయంలో తనకు కావలసిన ఎరువులు కొనుగోలుకు యానం తదితర ప్రాంతాలకు వెళ్లి సమయానికి అవసరమైన ఎరువులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత ప్రభుత్వం తన గ్రామంలోనే ఆర్‌బీకే ఏర్పాటు చేయడంతో స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచన మేరకు పంటలకు కావలసిన యూరియా, డీఏపీ వంటి ఎరువులను వారితోనే రప్పించుకుంటున్నారు. ఎరువుల కొరత సమయంలోనూ తనకు ఇబ్బందులు తగ్గాయంటున్నారు.

ఉచిత ఈ-క్రాప్ బుకింగ్‌తో భరోసా..



శలపాకకు చెందిన రైతు సున్న లక్ష్మణరావు గ్రామంలో రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు తాను నష్టపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ఆర్బీకేకి వెళ్లి రూపాయి కూడా చెల్లించనవసరం లేకుండా పంట ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్నారు. వర్షాలతో పంట నీట మునిగినా సీఎం జగనన్న అందిస్తున్న ఉచిత పంటల బీమాతో తనకు పరిహారం అందుతుందని నిశ్చింతగా ఉన్నానంటున్నాడు.

కాజులూరు మండలంలో రైతులకు పథకాల వారీ సొమ్ములు ఇలా..

రైతు భరోసా

సంవత్సరం	రైతులు	సొమ్ములు
2019-20	9572	12.93 కోట్లు
2020-21	10842	14.62 కోట్లు
2021-22	11045	14.91 కోట్లు
2022-23	11085	14.92 కోట్లు

సున్నా వడ్డీ రుణాలు

సంవత్సరం	రైతులు	సొమ్ములు
2019-20	11416	167.74 లక్షలు
2020-21	6451	71.53 లక్షలు
2021-22	7096	78.64 లక్షలు

ఇన్‌పుట్ సబ్సిడీ

సంవత్సరం	రైతులు	సొమ్ములు
2020-21	11803	8.62 కోట్లు
2021-22	12088	9.17 కోట్లు

వైఎస్సార్ పంట బీమా

సంవత్సరం	రైతులు	సొమ్ములు
2020-21	8976	15.16 కోట్లు
2021-22	13458	45.62 కోట్లు

సకాలంలో బీమా, నష్టపరిహారాలు



బంధనపూడికి చెందిన చిర్ల వెంకటరెడ్డి రైతు. గతంలో పంట నష్టం జరిగిన తరువాత మరుసటి ఏడాది రైతులకు బీమా సొమ్ములు అందేవని, అది కూడా అరకొరగానే ఉండేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుకు సకాలంలో బీమా, నష్టపరిహారాల సొమ్ములు వేసి ఆదుకుంటున్నారు. సీఎం జగనన్న రైతు కష్టాలను తెలిసిన వ్యక్తి కావటంతో ఇంత పెద్ద ఎత్తున రైతులకు సొమ్ములు వస్తున్నాయని రైతు అన్నారు.

రైతులకు అందుబాటులో అధికారులు



గతంలో మండలానికి ఓ వ్యవసాయాధికారి, ఆయనకు ఇద్దరు సహాయకులు ఉండేవారు. ప్రస్తుతం కాజులూరు మండలంలో 23 ఆర్బీకేలు ఉన్నాయి. ప్రతి కేంద్రంలోనూ ఒక వీఏఏ, ఒక టెక్నికల్ అసిస్టెంట్ రైతులకు అందుబాటులో ఉండటంతో వారి ద్వారా సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. సాగుకు కావలసిన ఎరువులు, పురుగుమందులు, యంత్రపరికరాలు రైతులకు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాం. ఎప్పటికప్పుడు రైతులు సాగుచేసే పంటలను ఈ క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేస్తూ పండించిన పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడమే కాకుండా ప్రభుత్వ పథకాల ద్వారా అందే సహాయాలు రైతులకు సక్రమంగా అందేలా కృషి చేస్తున్నాం.

– వి.అశోక్, ఏఓ, కాజులూరు

ఎంపీ బోస్ పరామర్శ



భీమేశ్వరరావు కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

కాజులూరు: శీలలో ఇటీవల మృతి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణకుమారి భర్త, మండల పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ దడాల భీమేశ్వరరావు కుటుంబీకులను శనివారం రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తదితరులు పరామర్శించారు. శీల గ్రామ సర్పంచ్‌గా, శీల, ఒంటితాడి ఎంపీటీసీ సభ్యుడిగా చేసిన సేవలను ఎంపీ కొనియాడారు. మండల ఎస్సీ సెల్ నాయకులు దాస్యం సుమన్, పోలినాటి సూర్యచంద్రం తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పకడ్బందీగా భూ రీసర్వే పూర్తి చేయాలి

కాజులూరు: జగనన్న శాశ్వత భూ హక్కు రక్ష రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా శనివారం మండలానికి వచ్చిన ఆర్డీఓ సత్యనారాయణ మండల గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా మండలంలోని జగన్నాథగిరిలో భూ సర్వేలో భాగంగా రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న మక్కురాళ్ల ఏర్పాటును రోవర్ చెక్‌తో పరిశీలించారు. అనంతరం గొల్లపాలెం ఆర్బీకేలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి ప్రస్తుత ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులకు ఎటువంటి సహకారాలు అందిస్తున్నారో విలేజ్ అగ్రికల్చర్ సిబ్బందిని ఆరా తీశారు. బీసీ హాస్టల్‌లో జరుగుతున్న రీసర్వే వర్క్‌ను సందర్శించి కంప్యూటర్లలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ పి.సుబ్బారావు, ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వోలు, ఈశ్వరరావు, వరలక్ష్మి, వీఆర్ఏలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- రాయవరంలో గడప గడపకూ..



రాయవరంలో ఓ వృద్ధుడికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత రిమ్మలపూడి సత్యనారాయణచౌదరి తదితరులతో కలిసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయ వ్యవస్థతో దేశంలోనే ఆదర్శవంతమైన పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్నారన్నారు. మరోమారు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు నాలుగేళ్లలో అందించిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గంటి రోజా, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

అమ్మవారికి భక్తుల విరాళం



విరాళం అందజేస్తున్న చినవెంకటరాజు

రాయవరం: స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు శనివారం నగదు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన వల్లూరి వీరయ్యమ్మ జ్ఞాపకార్థం భర్త వల్లూరి చినవెంకటరాజు రూ.50,010 ఆలయ కమిటీకి శాశ్వత చందాగా అందజేశారు. ఆలయ కమిటీ నేతలు సత్తి వెంకటసుబ్బారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్), సత్తి వెంకటరెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి(మందులషాపు శ్రీను), నల్లమిల్లి రామారెడ్డిలకు అందజేశారు. విరాళాన్ని అమ్మవారి జాతర ఉత్సవానికి వినియోగించాలని చినవెంకటరాజు కమిటీ సభ్యులను కోరారు.

జగనన్న ఆణిముత్యం కృత్తివెంటి విద్యార్థిని



నగదు బహుమతిని అందుకుంటున్న సుల్తానా

రామచంద్రపురం: జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు మొదటి నగదు బహుమతిని పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల విద్యార్థిని అందుకుంది. కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ సీఈసీలో షేక్ సయ్యద్ సుల్తానా 1000 మార్కులకు 955 సాధించి జిల్లాలో ఆర్ట్స్‌లో మొదటి స్థానంలో నిలిచింది. శనివారం అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో రూ.50 వేల నగదు బహుమతిని మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా అందుకున్నారు.

దళిత సామాజిక అభ్యున్నతికి జగన్ కృషి

కపిలేశ్వరపురం: దళిత సామాజిక అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. పడమర ఖండ్రికలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 75 ఏళ్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయ చరిత్రలో మాదిగ సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని సామాజిక వర్గాల ప్రయోజనాలను కాపాడుతున్నారన్నారు. గత ప్రభుత్వం దళితులను తీవ్రంగా విస్మరించిందని, ఆ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ప్రకటనలను తమ సామాజిక వర్గీయులెవరూ నమ్మరన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా సంక్షేమ పాలనకే ప్రజలు తిరిగి పట్టం కడతారని ఇజ్రాయిల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, నాయకులు తాతపూడి రాజేశ్ శర్మ, యర్రగుంట అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి ఎంతో కీలకం

రామచంద్రపురం: రాష్ట్రం ప్రగతి పథంలో పురోగమించాలంటే మహిళే కీలకమని గుర్తెరిగి ప్రభుత్వం మహిళా అభివృద్ధి సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయలో కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం పట్టణంలోని మెప్మా రిసోర్స్ పర్సన్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి వేణు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, జగనన్న తోడు, బ్యాంక్ లింకేజీ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలందరూ సున్నా వడ్డీతో జగనన్న మహిళా మార్ట్ పేరుతో సూపర్ మార్కెట్లను ప్రారంభించి డ్వాక్రా ఉత్పత్తులను, నిత్యావసరాలను తక్కువ ధరలకే ప్రజలకు అందించాలని తద్వారా సున్నా వడ్డీ రుణాలతో మహిళలు జీవనోపాధిని ఆర్థిక సాధికారతను మెరుగుపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, పట్టణ మెప్మా కో ఆర్డినేటర్ మంగాదేవి, మెప్మా సిబ్బంది, సమాఖ్య రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

పేదలకు భరోసానిచ్చే ప్రభుత్వం

- మంత్రి వేణు
- పట్టణంలో గడప గడపకూ మన ప్రభుత్వం



పట్టణంలోని 24వ వార్డులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి ప్రజలకు భరోసాను కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర బీసీ సంక్షేమం , సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 12వ సచివాలయం పరిధిలోని 25వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం మంత్రి వేణు పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వం ద్వారా పొందిన పథకాల లబ్ధిని వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ పరిపాలనలో ఎన్నో వ్యవస్థలున్నప్పటికీ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన పారదర్శక పాలన అందుతుందన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రూపొందించారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అవినీతి లేని పాలనే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అన్నారు. ప్రతి ఇంటికీ ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. పురపాలక పరిధిలో చక్కటి పారిశుధ్యం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డులో ఉన్న మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణాన్ని స్వచ్ఛ రామచంద్రపురంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. అందులో భాగంగానే ప్రతి ఇంటికీ మొక్కలను అందిస్తామన్నారు. మార్కెట్‌లో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యలతో పాటుగా లోవోల్టేజీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. మార్కెట్‌లో మౌలిక సదుపాయాలకు తీసుకోవాల్సిన పనులను, మున్సిపల్ షాపుల్లో చేపట్టాల్సిన మరమ్మతులను తెలుసుకుని త్వరిత గతిని చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, స్థానిక కౌన్సిలర్ కోటిపల్లి లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు గుబ్బల గణ, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కంచుమర్తి బాబూరావు, పెంటపాటి శ్రీను, మల్లిడి సత్తిరెడ్డి, కొండేపూడి సురేష్, కోటిపల్లి శివాజీ, మందపల్లి చిట్టిబాబు, మట్టా బాబులు, కుడిపూడి లలిత, మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్, ఎస్సై డి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కమిషనర్ కన్యాకుమారి మృతి



వీవీ కన్యాకుమారి (ఫైల్)

మండపేట: గతంలో మండపేట మున్సిపల్ కమిషనర్‌గా రెండు పర్యాయాలు పనిచేసిన వీవీ కన్యాకుమారి శనివారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆమె వయస్సు 55 సంవత్సరాలు, ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సెలవుపై హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 2007 నుంచి 2009 వరకు, అలాగే 2012 నుంచి 2015 వరకూ రెండు పర్యాయాలు ఆమె మండపేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. కేపీ రోడ్డు విస్తరణ, డంపింగ్ యార్డు నుంచి చెత్త తరలింపులో కీలకంగా పనిచేశారు. ఆమె మృతి విషయం తెలిసి మున్సిపల్ ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తదితరులు కన్యాకుమారి మృతికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సప్తగోదావరి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తూనే నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆలయ ఈఓ తారకేశ్వరరావును ఆదేశించారు. మంత్రి వేణు శనివారం సాయంత్రం సప్తగోదావరిలో చేపట్టిన కాంక్రీట్ పనులను పరిశీలించి మేస్త్రికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ, బాలాంత్రం రాజు, చెల్లుబోయిన ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పాలవెల్లువను విజయవంతం చేయాలి



పాలవెల్లువ, సురక్ష పథకాలపై సమీక్ష చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: జగనన్న పాలవెల్లువ, జగనన్న సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ కోరారు. జగనన్న పాలవెల్లువ, జగనన్న సురక్ష పథకాలపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష జరిపారు. ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారు డాక్యుమెంట్లను సచివాలయంలో సబ్మిట్ చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధిని చేస్తుందన్నారు. మహిళా పాడి రైతులు 11 మందితో సొసైటీని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు తదితరులు సమీక్ష నిర్వహించి, అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు.

‘వైఎస్సార్ పశు బీమా’పై అవగాహన

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున్ ఆధ్వర్యంలో వైఎస్సార్ పశు బీమా పథకంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కర్నేడి మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని పశు బీమా పథకంపై అవగాహన కల్పించారు. పాడి రైతులు గరిష్టంగా 5 పాడి పశువులకు బీమా పథకాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. రూ.30 వేలకు రూ.399, రూ.15 వేలకు రూ.192 చెల్లించి బీమా నమోదు చేసుకోవాలన్నారు. పాడి రైతులు బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, పీఏసీఎస్ చైర్మన్ దంగేటి చినబాబు, సర్పంచ్ చిగురుపాటి రామలక్ష్మి, ఎంపీటీసీ ఇంత దుర్గాభవాని, భీమక్రోసుపాలెం సర్పంచ్ పలివెల లోవరాజు, ఎంపీటీసీ యెన్నం దేవి, రామచంద్రపురం డివిజన్ ఏడీ ఒ.రామకృష్ణ, వెల్ల పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రరావు, పశు వైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.